


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ    సంపుటి : 01    సంచిక : 80    గురువారం 20 ఆగష్టు 2026    పేజీలు : 8    వెల : 2/-

## ట్రంప్-కిమ్ భేటీకి మళ్లీ రంగం సిద్ధం.. తెర వెనుక ఏం జరుగుతోంది

- కిమ్‌తో మరోసారి భేటీకి ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు
- నవంబర్‌లో చైనాలో సమావేశం జరిగే అవకాశం
- దక్షిణ కొరియాతో సైనిక విన్యాసాలను తగ్గించిన అమెరికా
- కిమ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందన్న ట్రంప్
- గతంలో మూడుసార్లు భేటీ అయినా ఫలించని చర్చలు



2

## ఎన్టీఏలో సమూల ప్రక్షాళన.. 600 మంది నిపుణుల తొలగింపు

- 600 మంది నిపుణులను తొలగించి, కొత్త వారి నియామకం
- ప్రశ్నపత్రాల పరిశీలనకు నాలుగంచెల తనిఖీ వ్యవస్థ ఏర్పాటు
- సీఐఎస్ఎఫ్ భద్రతతో కొత్త ప్రాంగణంలోకి ఎన్టీఏ కార్యాలయం



2

## ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం నా రాజకీయ జీవితంలో చూడలేదు: చంద్రబాబు



- ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే విలువ ఉంటుందన్న చంద్రబాబు
- వైసీపీ నేతలు అసెంబ్లీకి రాకుండా తప్పించుకోవడం వింతగా ఉందని వ్యాఖ్య
- జగన్‌కు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందన్న సీఎం

## పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్ 10 రోజుల విదేశీ పర్యటన

- యూకే, అమెరికాలో పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం
- ప్రఖ్యాత వర్సిటీలు, గ్లోబల్ సీఈవోలతో సమావేశాలు
- లండన్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహానికి హాజరు
- ఢిల్లీ సీడబ్ల్యూసీ భేటీ అనంతరం పయనం

2



## రేవంత్ రెడ్డి పై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యల పై మల్లు రవి స్పందన

- పరకాల టికెట్ మళ్లీ రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామన్న రేవంత్
- ఎన్నికలకు చాలా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారన్న సుస్మిత
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవన్న మల్లు రవి

2



## కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారుల అభివృద్ధి పనులు పరిశీలన



- న్యూఢిల్లీ నేషనల్ హైవే అథార్టీ అధికారుల బృందం ఆత్మకూరు ప్రాంతంలో సుడిగాలి పర్యటన
-మూడు డీపిఆర్ లు తో కూడిన రహదారుల మ్యాప్ పరిశీలన
-భానుముకుల టర్నింగ్ నుంచి వేంపెంట, వెలుగోడు మీదుగా రహదారు పనులు చేపట్టేందుకు పరిశీలన
-నల్లకాలువ గ్రామం నుంచి వైయస్సార్ స్మృతి వనం మీదిగా వెళ్లే రహదారికి వన్యప్రాణుల అడ్డంకులు
-జాతీయ రహదారుల అభివృద్ధి పిడి తో పాటు న్యూఢిల్లీ నేషనల్ హైవే అథారిటీ అధికారుల బృందం పర్యటన

## మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు



- సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ కోరిన కమిటీ
- మూడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం
- మాజీ మంత్రి చిన్నారెడ్డికి కూడా షోకాజ్ నోటీసు
- వనపర్తి ఎమ్మెల్యే పై వ్యాఖ్యల పై చిన్నారెడ్డి షోకాజ్

2

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 20 ఆగస్టు 2026

## ట్రంప్-కిమ్ భేటీకి మళ్లీ రంగం సిద్ధం.. తెర వెనుక ఏం జరుగుతోంది

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మధ్య మరో ఉన్నతస్థాయి సమావేశం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ నాటికి కిమ్ తో వ్యక్తిగతంగా భేటీ అయ్యేందుకు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆయన అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. నవంబర్‌లో చైనాలోని షెన్‌జెన్‌లో జరగనున్న ఆసియా–పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా ఈ భేటీ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. 'తగిన సమయంలో' ఇద్దరు నేతలు కలుస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల దక్షిణ కొరియాతో సంయుక్త సైనిక విన్యాసాల ను ట్రంప్ గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. కిమ్‌తో తనకున్న సంబంధాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తన పిలుపునకు కిమ్ ఎందుకు స్పందించడం లేదని సోమవారం మీడియా ప్రశ్నించగా.. 'ఆయన ఇప్పటికే స్పందించారు' అని ట్రంప్ బదులిచ్చారు. ఆ స్పందన 'చాలా సానుకూలంగా' ఉందని, అయితే మరిన్ని వివరాలు చెప్పలేదు. కిమ్ తనను ఎప్పుడూ గౌరవంగా చూస్తారని, ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో కిమ్‌తో మూడుసార్లు సమావేశమ య్యారు. 2018లో సింగపూర్, 2019లో హనోయ్, అదే ఏడాది కొరియాల సరిహద్దు లో భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ఉత్తర కొరియా నేతతో సమావేశమవడం అదే మొదటిసారి. అప్పట్లో అణ్వస్త్ర నిరాయుధీకరణపై హామీలు ఇచ్చినా, ఆ చర్చలు మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఉత్తర కొరియా తన అణ్వస్త్ర, క్షిపణి సామర్థ్యాలను మరింత పెంచుకోవడంతో పాటు రష్యా, చైనాలతో సంబంధాలను బలోపేతం చేసుకుంది. ఉత్తర కొరియా అణ్వస్త్ర హోదాకు గుర్తింపు లేదా సైనిక ఉద్రిక్తతలు తగ్గడం వంటివి జరగవచ్చని అంచనా వేస్తున్నారు. మారుతున్న ప్రాంతీయ సవాళ్ల మధ్య తన వ్యక్తిగత దౌత్యానికి మళ్లీ జీవం పోసేందుకే ట్రంప్ ఈ తాజా ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## ఎన్టీఏలో సమూల ప్రక్షాళన.. 600 మంది నిపుణుల తొలగింపు

ఇటీవలి వివాదాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పరీక్షల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ చర్యలు చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల మేరకు ఎన్టీఏలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఏకంగా 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. పరీక్షల నిర్వహణను సురక్షితంగా, పారదర్శకంగా మార్చడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు చేపడుతున్నారు. మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల ఎన్టీఏ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షలను సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. ఇప్పటికే 50 మందికి పైగా సిబ్బందిని తొలగించామని, రాబోయే రెండు మూడు వారాల్లో మరో 20 నుంచి 25 మంది కొత్త అధికారులను నియమించనున్నామని తెలిపారు. పరీక్షల విధానంలో పటిష్టత కోసం పలు కీలక మార్పులు చేస్తున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉండేందుకు, వాటి పరిశీలనను బలోపేతం చేయడానికి నాలుగంచెల తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. దీంతో పాటు ఎన్టీఏ కార్యాలయాన్ని ప్రాధాన్యతా క్రమంలో కొత్త ప్రాంగణంలోకి మార్చనున్నారు. కార్యాలయ భద్రతను పటిష్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) బృందాలను మోహరించాలని నిర్ణయించారు. సంస్థాగత బలోపేతంలో భాగంగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ వంటి 10 కీలక వృత్తిపరమైన నాయకత్వ పదవుల కోసం ఎన్టీఏ ప్రకటనలు జారీ చేసింది. సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి ప్రత్యేక రంగాల కోసం ప్రైవేట్ రంగ నిపుణులను కూడా నియమించుకుంటున్నారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ ఆర్కిటెక్చర్‌ను పూర్తిస్థాయిలో మార్చాలని, పరీక్షల నిర్వహణ ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి దిద్దుబాటు చర్యలపై నివేదిక ఇవ్వాలని మంత్రి జోషి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## రేవంత్ రెడ్డి పై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యల పై మల్లు రవి స్పందన

తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. పరకాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయట పెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖను దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు.

# పెట్టుబడులే లక్ష్యం.. సీఎం రేవంత్ 10 రోజుల విదేశీ పర్యటన

తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, విద్యా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు.ఆగస్టు 20 ఆయన యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికాలో 10 రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 30న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఆగస్టు 19 ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొననున్న సీఎం, సమావేశం ముగిశాక రాత్రికి ఢిల్లీ నుంచే నేరుగా లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20న లండన్‌లో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరవుతారు. పర్యటనలో భాగంగా తొలుత యూకేలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ యూనివర్సిటీల ప్రతినిధులతో సమావేశమవుతారు. బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సందర్శించడంతో పాటు, ఎమిరేట్స్ స్టేడియంలో ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్‌కు హాజరవుతారు. అనంతరం ఆగస్టు 23న అమెరికాకు బయలుదేరి వెళ్తారు. అక్కడ బోస్టన్‌లోని హార్వర్డ్, ఎంఐటీ క్యాంపస్‌లను సందర్శిస్తారు. నార్త్‌ఈస్టర్న్, వర్జీనియా టెక్ యూనివర్సిటీల ప్రతినిధులతోనూ భేటీ అవుతారు. న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన భాగంగా ఆగస్టు 27, 28 తేదీల్లో గ్లోబల్ సీఈవోలు, వెంచర్ క్యాపిటలిస్టులు, బహుళజాతి సంస్థల అధిపతులతో పారిశ్రామిక రౌండ్‌టేబుల్ సమావేశాలు జరగనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై సీఎం దృష్టి సారిస్తారు. వాస్తవానికి ఈ పర్యటనలో చైనా, జర్మనీలను కూడా చేర్చాలని భావించినప్పటికీ, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో దానిని యూకే, అమెరికాకే పరిమితం చేశారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

# కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారుల అభివృద్ధి పనులు పరిశీలన





**ఆత్మకూరు ఆగస్టు 19 వార్త సాక్ష్యం**

రెండు తెలుగు రాష్ట్రాల మధ్యలో జాతీయ రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్న విషయం ప్రజలకు అందరికీ తెలిసిందే తెలంగాణ రాష్ట్రంలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంద్యాల వరకు 167కే. జాతీయ రహదారి పనులు శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆత్మకూరు నుంచి నల్ల కాలువ, వైయస్సార్ శృతి వనం, మీదుగా వెళ్లే జాతీయ రహదారి అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారుల, వన్యప్రాణుల అడ్డంకులు రావడంతో ఆ పనులు ఆత్మకూరు మంచి దాదాపు 3. కిమీటర్ల మేర జాతీయ రహదారు పనులు కొనసాగుతున్నాయి ఈ నేపథ్యంలోనే బుధవారం న్యూఢిల్లీ నేషనల్ హైవే అథారిటీ అధికారుల బృందం జాతీయ రహదారి అభివృద్ధి పనులను పరిశీలన చేస్తూ గతంలో 3 డి పి ఆర్ లు, ప్రణాళిక చేసిన జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు మ్యాప్ చూస్తూ జాతీయ రహదారి అభివృద్ధి పనులను చేరుపులు మార్పులు చేసే దిశగా సుడిగాలి పర్యటన చేశారు కర్నూలు నుంచి విజయవాడ వరకు ఎన్ఎస్ 340 ఎ జాతీయ రహదారి మీదుగా భానుమకుల టర్నింగ్ నుంచి బానకచర్ల, వేంపెంట, మీదిగా వెలుగోడు కస్తూర్బా పాఠశాల సమీపంలో నుంచి ఈ జాతీయ రహదారి అభివృద్ధి పనులు కొనసాగించే విధంగా నేషనల్ హైవే అథారిటీ అధికారులు మరోఆలోచన చేస్తున్నట్లు తెలిసింది పర్యావరణ పరిరక్షణలో భాగంగా నల్లమల అడవి ప్రాంతంలో పెద్ద పులుల అభయారణ్యం ఉండడంతో వైయస్సార్ శృతి వనం మీదుగా నేషనల్ హైవే అభివృద్ధి పనులు కొనసాగే అవకాశం లేకపోవడంతో భానుముకుల టర్నింగ్ నుంచి భానుక చెర్ల,వేంపెంట, మీదుగా జాతీయ అభివృద్ధి పనులు కొనసాగించే విధంగా అతి త్వరలోనే అధికారులు పూర్తిస్థాయిలో పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు న్యూఢిల్లీ నేషనల్ హైవే అథారిటీ అధికారులు జాతీయ రహదారుల అభివృద్ధి పిడి తెలియజేశారు.

## ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం నా రాజకీయ జీవితంలో చూడలేదు: చంద్రబాబు

శాసనసభ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిన వైసీపీ అధినేత జగన్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన సీఎం... ఒక పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం తన సుదీర్ఘ రాజకీయ జీవితంలోనే ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా చర్చిస్తేనే వాటికి సరైన గుర్తింపు, విలువ ఉంటాయని, సభకు హాజరుకాకుండా బయట ఎంత మాట్లాడినా ప్రాధాన్యత ఉండదని తెలిపారు. గతంలో తాను సవాల్ చేసి అసెంబ్లీ నుంచి బయటకు వచ్చినప్పటికీ, తమ పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం చివరి వరకు సభలోనే ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడారని గుర్తుచేశారు. కానీ వైసీపీ నేతలు మాత్రం సభకు రాకుండా తప్పించుకోవడం వింతగా ఉందని, ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్న జగన్‌కు అసలు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాల ను కప్పిపుచ్చుకోవడానికే జగన్ అసెంబ్లీ నుంచి తప్పించుకుంటున్నారని, డీఎస్సీ అంశంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తమ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించిందని, ఈ నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలు స్వాగతిస్తుంటే జగన్ ఇంకా బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

# మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసు

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

**సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత చేసిన బహిరంగ వ్యాఖ్యలను పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి సురేఖ నుంచి వివరణ కోరింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రభుత్వ పెద్దలపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై మూడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సురేఖను ఆదేశించింది. ఇటీవల జరిగిన ఓ సభలో రేవూరి ప్రకాశ్ రెడ్డిని మరోసారి గెలిపించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన సుష్మిత.. అధిష్ఠానాన్ని సంప్రదించుకుండా మీరెలా అభ్యర్థిని ప్రకటిస్తారని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా పరకాల నుంచి తాను పోటీ చేసి గెలిచి తీరతానని తేల్చి చెప్పారు.

**చిన్నారెడ్డికి కూడా నోటీసు**

మరోవైపు వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లోనూ వివాదం తెరపైకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యేపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి జి. చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. డబ్బులు తీసుకొని ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని ఇటీవల చిన్నారెడ్డి ఆరోపించారు. అందుకే తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీటు రాలేదని పేర్కొన్నారు. ఫలితంగా వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేశారని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని.. అవినీతికి పాల్పడేవారిని బయటకు గెంటేస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నేతలపై పార్టీ లైన్ దాటి బహిరంగంగా విమర్శలు చేస్తే సహించబోమని క్రమశిక్షణ కమిటీ హెచ్చరించినట్లు సమాచారం. ఇద్దరు సీనియర్ నేతలకు ఒకేసారి నోటీసులు జారీ కావడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ చర్చ మొదలైంది. పార్టీ టికెట్ల అంశం చుట్టూ కొనసాగుతున్న అసంతృప్తి ఈ పరిణామాలతో మరోసారి బయటపడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రూ.20 లంచం కేసు.. 30 ఏళ్ల తర్వాత ఇద్దరు ఉద్యోగులకు సుప్రీం ఊరట

కేవలం రూ. 20 లంచం ఆరోపణలతో మూడు దశాబ్దాలు పాటు సాగిన సుదీర్ఘ న్యాయపోరాటానికి సర్వోన్నత న్యాయస్థానం తెరదించింది. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ట్రయల్ కోర్టు, హైకోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తూ వారికి పూర్తి ఊరట కల్పించింది. కేసు నేపథ్యం పరిశీలిస్తే, 1996 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బెచారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యాపరమైన రాయితీల నిమిత్తం ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఇన్‌కమ్ సర్టిఫికెట్) కోసం ఒక విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, అక్కడి క్లర్క్ రూ. 120 (తనకు రూ. 100, ప్యూన్‌కు రూ. 20) లంచం డిమాండ్ చేశాడని సదరు విద్యార్థి అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రంగు పూసిన నోట్లతో ఉచ్చు పన్నారు. సర్టిఫికెట్ అందుకున్న అనంతరం విద్యార్థి, ప్యూన్‌కు రూ. 20 ఇచ్చాడు. ఆ నగదును అధికారులు ప్యూన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే, క్లర్క్ డిమాండ్ చేశాడన్న రూ. 100 మాత్రం ఎక్కడా లభించలేదు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. కేవలం నగదు రికవరీ అయినంత మాత్రాన లంచం తీసుకున్నట్లు నిర్ధారించలేమని, లంచం 'డిమాండ్' చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండాలని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చి చెప్పింది. ఫిర్యాదుదారుడైన విద్యార్థి వాంగ్మూలంలో పలు వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు గుర్తించింది. ప్యూన్ తనను ఎప్పుడూ డబ్బు అడగలేదని విద్యార్థి క్రాస్ ఎగ్జామినేషన్‌లో అంగీకరించిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. పని పూర్తయిన తర్వాత డబ్బు ఇవ్వడం, "మరుసటి రోజు పండుగ కావడంతో విద్యార్థి తనకు ఆ నగదు ఇచ్చాడన్న" ప్యూన్ వాదన సహేతుకంగా ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అలాగే క్లర్క్‌పై కేసు నమోదుకు ఉన్నతాధికారి ఇచ్చిన అనుమతి కూడా చెల్లదని పేర్కొంది. ఈ కారణాలతో దిగువ కోర్టుల తీర్పులను కొట్టివేస్తూ, 30 ఏళ్ల సుదీర్ఘ కేసుకు ముగింపు పలికింది.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## ఉద్యమ కెరటాలు నిలిచేనా?



మాతృదేశంలో జన చైతన్య ఉరుములు మెరుపులకు సంబంధిత ప్రవాసులు స్పందించడం సహజం. ప్రవాస భారతీయ యువత అలనాటి స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి జంతర్ మంతర్ పోరాటం దాకా ప్రతి ప్రజాప్రతిఘటనకు ప్రభావశీలంగా ప్రతిస్పందిస్తూనే ఉన్నది. మాతృదేశంలో యువత చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా విదేశాలలోని యువత నుంచి లభించిన స్పందన ఆశ్చర్యం కలిగించింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ప్రజ్వరిల్లిన విద్యార్థి ఉద్యమానికి మద్దతుగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలోని ప్రధాన నగరాలలో నిర్వహించిన ప్రదర్శనలలో ప్రవాస యువ భారతీయులు అంచనాలకు మించి పాల్గొన్నారు. పాలనా వ్యవస్థల్లో అవినీతి నిర్మూలనకై 2011లో అన్నా హజారే నిర్వహించిన ఉద్యమ సందర్భంలో కంటే ఎక్కువగా జంతర్ మంతర్ విద్యార్థుల పోరుకు ప్రవాస భారతీయ యువత స్పందించింది.

అయితే గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయ సమాజం మాత్రం 'బొద్దింకల పోరు'పై ఆచితూచి స్పందించింది. ఈ దేశాలలో సీబీఎస్ఈ అనుబంధ భారతీయ పాఠశాలలు 170 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులలో, స్వదేశంలో వైద్య విద్యాభ్యాసానికి తాపత్రయ పడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. 'నీట్' పరీక్షా కేంద్రాలు సైతం ఈ దేశాలలో ఉన్నాయి. 'నీట్' ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ కావడం, తరువాత ఆ పరీక్ష రద్దు కావడం, పిమ్మట ఇరాన్ యుద్ధం మూలంగా సీబీఎస్ఈ సంవత్సరాంత పరీక్షలూ రద్దయ్యాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ దేశాలలోని సీబీఎస్ఈ పాఠశాలల భారతీయ విద్యార్థులు నష్టపోయారు. అమెరికా, ఐరోపా, ఇతర పాశ్చాత్య దేశాలలోని భారతీయ విద్యార్థులు ఆయా దేశాల విద్యావిధానంలో విద్యనభ్యసిస్తారు. భారతీయ విద్యా విధానాలతో వారికి సంబంధముండదు. వివిధ పాశ్చాత్య దేశాలలోని ప్రవాస భారతీయులు ఉత్సాహంగా ముందుకు వచ్చి సీజేపీ పోరాటానికి బాసటగా నిలిచారు. అయితే గల్ఫ్‌లోని ప్రభావిత విద్యార్థులు కనీసం సామాజిక మాధ్యమాలలో కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించలేదు!

వర్తమాన భారత రాజకీయాలలో ఒక వినూత్న సంచలనాన్ని సృష్టించిన అభిజిత్ దీప్కే (సీజేపీని ప్రారంభించిన జెన్--జీ పోరాటకారుడు) భారతీయ యువత మానసిక అలజడిని సరిగ్గా అర్థం చేసుకున్నాడు. వారిలో పోరాట జ్వాల రగిలించాడు. అధికారాన్ని ప్రశ్నించే యువశక్తికి ప్రతీకగా ప్రభవించాడు.

ప్రశ్న పత్రాల లీకులకు వ్యతిరేకంగా జరిగిన సీజేపీ ఉద్యమం యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తి, ఆగ్రహాన్ని సంపూర్ణంగా వ్యక్తం చేసేందుకు ఒక వేదిక అయింది. స్వదేశంలో అవకాశాలు లేకనే యువత విదేశీబాట పడుతోందనే విషయాన్ని నిజాయితీగా అంగీకరించాలి.

ఆక్రోశం, ఆవేదన ఎంతగా ఉన్నా వాటిని వ్యక్తీకరించేందుకు అవసరమైన ధైర్యసాహసాలు అందరికీ ఉండవు. విదేశాలలో ఉన్నా, స్వదేశంలో ఉన్నా వర్తమాన సామాజిక అంశాల పట్ల స్పందించడం అనేది వ్యక్తుల చైతన్యశీలతపై ఆధారపడి ఉంటుంది. ప్రత్యేకించి వృత్తిపరంగా మెరుగైన అవకాశాలు, వ్యక్తిగత ఆర్థిక సమున్నతికి విదేశాలకు వచ్చే భారతీయులలో మాతృభూమిలోని సామాజిక ఉద్యమాలు, పోరాటాల పట్ల సహానుభూతి చూపేవారు ఎంతోమంది ఉండరు.

అభిజిత్ దీప్కే వలే బోస్టన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన రాజన్ కిలెచంద్ దుబాయిలోని ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆ విశ్వవిద్యాలయానికి 25 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చిన వితరణశీలి. అయితే స్వదేశంలోని సామాజిక ఉద్యమాలపై ఆయన అంతగా ఆసక్తి చూపరు. సంపన్న ప్రవాస భారతీయులలోని అత్యధికులకు రాజన్ ఒక ప్రతీక.

మొత్తం మీద స్వల్ప సంఖ్యలో ఉండవచ్చుగానీ విదేశాలలోని భారతీయ యువత మాతృభూమిలో సంభవిస్తున్న సంఘటనల పట్ల చురుగ్గా ప్రతిస్పందిస్తుందని చెప్పవచ్చు.

ఈజిప్టు నుంచి బంగ్లాదేశ్ దాకా ఆగ్రహంతో గళమెత్తి ప్రభుత్వాలను కూల్చివేసిన యువత, కొత్త పాలకుల విధానాలను ప్రభావితం చేయడంలో విఫలమయిందనేది ఒక చేదు సత్యం. దశాబ్దం క్రితం ఇదే ఢిల్లీలో దుమారంతో పాటు ఒక ఆశను రేకెత్తించిన విద్యార్థి నాయకుడు కన్నయ్య కుమార్ ఉద్యమం తదనంతర కర్తవ్య సాధనలో ఎంతవరకు సఫలీకృతమయిందనేది కూడా గుర్తు చేసుకోవాలి. రాజకీయ క్రీడల్లో భాగం కాకుండా భావితరాలకు మేలు జరిగేలా నిర్మాణాత్మకంగా అడుగులు ముందుకు వేయవలసిన బాధ్యత ఉద్యమిస్తున్న భారతీయ యువతపై ఉన్నది.

# స్వతంత్ర వ్యవస్థలు లేని స్వాతంత్ర్యానికి అర్థముందా?



'రాజ్యాంగంలో అత్యున్నత పదవిని నిర్వర్తిస్తున్న ప్రధానమంత్రి ఒక పవిత్రమైన బాధ్యతను నిర్వర్తిస్తూ ఉంటారు, అలాంటి వారి నిర్ణయాలకు దురుద్దేశాలను ఆపాదించవచ్చా?' అంటూ భారతదేశ సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా వాదించారు. దీనికి నేపథ్యం ఏమిటంటే-- భారత ప్రధాన ఎన్నికల అధికారిని, ఇతర ఎన్నికల అధికారులను నియమించే హైపర్ కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేవారు. ఈ విధానానికి స్వస్తిపలికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ఒక క్యాబినెట్ మినిస్టర్‌ను నియమించుకునేలా భారత పార్లమెంటు 2023లో చట్టాన్ని చేసింది. 'సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని హైపవర్ కమిటీ నుంచి తొలగించవలసిన ఆవశ్యకత ఎందుకు ఏర్పడింది, అలా చేయడం వల్ల ఏకపక్ష నిర్ణయాలకు అవకాశాలు పెరిగినట్లు కాదా...' అంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ప్రధాన మంత్రి నిర్ణయాలకు దురుద్దేశాలు ఆపాదించవచ్చా' అన్న వ్యాఖ్యను సొలిసిటర్ జనరల్ ఈ సందర్భంగానే చేసారు. సొలిసిటర్ జనరల్ లాంటి వ్యక్తులకు కూడా శాస్త్రీయ అవగాహన లోపించడం చాలా విచారకరం. పరిపాలన నియమ నిబంధనల బట్టి సాగుతుందా లేక అధికారాన్ని చేపట్టిన వ్యక్తులపై ఉండే నమ్మకాన్ని బట్టి జరుగుతుందా? సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సెలెక్షన్ కమిటీ నుంచి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో వివరించకుండా ప్రధాన మంత్రి వ్యక్తిత్వాన్ని ప్రస్తావించడం ఒక వింత. అంతటితో ఆగక 'కేంద్ర క్యాబినెట్‌లో ఎవరెవరు మంత్రులుగా ఉండాలో నిర్ణయించేటప్పుడు కూడా ఒక న్యాయమూర్తిని లేదా రిటైర్డ్ జడ్జిని ప్రధానమంత్రి సంప్రదించాలా' అంటూ తుషార్ మెహతా అసందర్భ వ్యాఖ్యలు చేశారు.

మెహతా పరిభాషలో, ప్రధానమంత్రిని పూర్తిగా విశ్వసించేటట్లయితే పార్లమెంటు వ్యవస్థ అవసరం లేదు, పార్లమెంటులో బిల్లులపై చర్చ అవసరమే లేదు. ప్రధానమంత్రి నోటి మాటనే శాసనంగా రాసుకోవచ్చు. మంత్రులు, న్యాయవ్యవస్థ కూడా అక్కర్లేదు. అందరూ ప్రధానమంత్రి ఆదేశాలను అమలుపరిస్తే సరిపోతుంది. వెరసి, ఇలాంటి వ్యవస్థ రాచరిక పరిపాలనను స్థిరపరుస్తుంది.

భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా నడవకపోతే దేశ ప్రజాస్వామ్యం ఒక బూటకమే. ఎన్నికల వ్యవస్థను శాసించే ప్రధాన అధికారిని, ఎన్నికల అధికారులను ఏకపక్షంగా నిర్ణయించినప్పుడు అది దాని ఉనికి కోల్పోయినట్లే. ప్రధానమంత్రి, కేంద్ర క్యాబినెట్ మంత్రి, ప్రతిపక్ష నాయకుడు కలిసి తీసుకునే నిర్ణయాలలో నిష్పక్షపాతం సాధ్యమవుతుందా? ప్రతిపక్ష నాయకుడి మాట అరణ్యరోదనగా మిగిలిపోదా? ఇలాంటి వ్యవస్థను పార్లమెంటు చట్టం ద్వారా సృష్టించడం ఘోరమైన తప్పిదం! ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తే సుప్రీంకోర్టులో ఎద్దేవా చేసే విధంగా సొలిసిటర్ జనరల్ మాట్లాడటం గర్హనీయం. భారత ప్రజల అదృష్టవశాత్తు ఎన్నికల బాండ్ల వ్యవస్థను సుప్రీంకోర్టు 2024లో రద్దు చేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా అవినీతి అధికారికంగా రహస్యమైపోయింది. నిస్సిగ్గుగా సదరు వ్యవస్థను సమర్థించుకునే ప్రయత్నాలు జరిగాయి. కానీ సుప్రీంకోర్టు ఏ మాత్రం వెరవకుండా ఆ వ్యవస్థను రద్దుచేసి, ఇక నుంచి ఎన్నికల బాండ్లను విడుదల చేయవద్దని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. ప్రైమ్‌మినిస్టర్ కేర్స్ (పీఎం కేర్స్) అనే అత్యవసర నిధుల విధానం అమల్లో ఉన్నది. దాని ద్వారా ఖర్చు పెట్టే విధానం మొత్తం పూర్తిగా గోప్యంగా సాగుతున్నది. స్వతంత్ర వ్యవస్థలో రహస్యానికి తావుండకూడదు. అలాంటప్పుడు పీఎం కేర్స్ నిధుల వినియోగం వ్యవహారం కూడా ప్రజా బాహుళ్యంలో అందుబాటులో ఉండాలి.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి వ్యవస్థ పంజరంలో చిలుక మాదిరిగా ప్రభుత్వ పెద్దలు చెప్పిందే పలుకుతుందని ఎప్పటి నుంచో ఆరోపణ ఉండనే ఉంది. దానికి తోడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి వ్యవస్థలు కేవలం ప్రతిపక్ష పార్టీల నాయకులపై, ప్రభుత్వానికి మింగుడు పడని వ్యక్తులపై విరుచుకుపడి ప్రభుత్వానికి లొంగిపోయే వరకు వేటాడుతున్న సందర్భాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

శాసన నిర్మాణానికి ఆనవాలుగా ఉన్న భారత పార్లమెంట్‌లో ఏ మాత్రం సుహృద్భావ వాతావరణం లేదు. దీనికి ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదే. మరోపక్క ప్రతిపక్ష పార్టీలు కూడా ఎలాగూ మా మాట వినరు కాబట్టి మేము ఎందుకు సహకరించాలి అన్నట్టు పార్లమెంటులో రభస చేయటమూ అంగీకారం కాదు. ఇదే అదనుగా ప్రభుత్వం కూడా అనుకున్న విధంగా చట్టాలను రూపొందిస్తూ పోతున్నది. న్యాయస్థానాలలో వాదోపవాదాలు జరుగుతున్నా, పక్షపాత వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నది. కొత్త న్యాయ సూత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా స్వదేశంలోనే ఎలాంటి న్యాయవిచారణ లేకుండా ఎంతకాలమైనా సరే పౌరులను జైలులో పెట్టే విచక్షణాధికారాలు ఏర్పరచుకున్నారు. నాలుగవ ఎస్టేట్‌గా పిలువబడే మీడియాను కేంద్రం ఏ మాత్రం విశ్వసించడం లేదన్న సంకేతాన్ని స్పష్టంగా ఇచ్చారు. ప్రధానమంత్రి మధ్యవర్తుల ద్వారా సమాచారాన్ని ఇవ్వరు, నేరుగా ప్రజలతోనే సంప్రదింపులు చేస్తారు అంటూ సరాసరి ఐఎఫ్ఎస్ ఆఫీసర్లతో చెప్పించారు. అందుచేతనే కాబోలు ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' మాత్రమే నిర్వర్తిస్తూ ఈ మధ్యలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ జంతర్ మంతర్ నిరసనలపై సెల్ఫీ వీడియోని ప్రచారం చేశారు కానీ, మీడియా ముందు తమ అభిప్రాయాలను పంచుకోలేదు. ఈ విధంగా ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టయిన శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా వ్యవస్థలు తమ స్వతంత్రతను కోల్పోయినప్పుడు భారత ప్రజాస్వామ్యంతో పాటు 80 ఏళ్ల స్వాతంత్ర్యమూ ప్రమాదంలో పడ్డట్లే.

# భార్యాభర్తలుగా కలసి జీవించారు-ఇద్దరు భార్యాభర్తలు ఒకే రోజు ప్రాణం విడిచారు





**-ఆత్మకూరు పట్టణంలో నందవరం కుటుంబంలో విషాదం**

**-ముంద హైదరాబాద్ లో భార్య మృతి ఆత్మకూరులో భర్త మృతి**

**-భార్యాభర్తల్ని ఒకే చోట అంత్రక్రియలు**

**-నందవరం ఎల్ఐసి సుబ్బరాయుడు నందవరం నందవరం లక్ష్మీదేవిలు మృతి**

ఆత్మకూరు ఆగస్టు 19 వార్త సాక్ష్యం

సమాజంలో మానవ జీవితం ప్రాణం ఎంతో విలువైంది భార్యాభర్తలు కలిసి ఒకరికి ఒకరు ఏకమయ్యారు భార్యాభర్తలు ఇద్దరు ఒకేరోజు ప్రాణాలు కోల్పోయారు ఈ సంఘటన ఆత్మకూరు పట్టణంలో బుధవారం నందవరం కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి కుటుంబ సభ్యులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని అప్పలకుంటలో నివాసముంటున్న నందవరం (ఎల్ఐసి)సుబ్బరాయుడు ఆయన భార్య నందవరం లక్ష్మీదేవి అనారోగ్యంతో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో చికిత్స తీసుకుంటూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది ఆమె మృతి దేహాన్ని ఆత్మకూరు పట్టణానికి తీసుకొని రాగా ఒకవైపు అంతక్రియలకు నందవరం కుటుంబ సభ్యులు తయారవుతున్న నేపథ్యంలో మరోవైపు ఊహించని విషాదం నెలకొంది నందవరం ఎల్ఐసి సుబ్బరాయుడు భార్య మృతి జీర్ణించుకోలేక గుండెపోటుతో సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుపోయింది భార్యాభర్తలుగా కలసి జీవించారు ప్రాణం పోయినా భార్యాభర్తలు ఒకరికి ఒకరు పక్కపక్కనే భూస్థాపితం చేశారు నందవరం కుటుంబంలో ఊహించని విషాదం నెలకొంది భూలోకంలో భార్యాభర్తలు గా కలిసి ఉండి కైలాసంలో ఆ పరమాత్ముని దగ్గర జంటగా ఉండడం మానవ జీవితంలో కొందరికే వరిస్తుందని చెప్పవచ్చు భార్యాభర్తలు కలిసి ఒకరిపై ఒకరు ప్రేమ అనురాగాలు చూసుకొని చివరికి ప్రాణాలు పోయిన కలిసే ఉందాం అనే మాట ఆ భగవంతుడు నెరవేర్చాడు

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఆత్మకూరు సెక్షన్ విద్యుత్ జే.యల్.యం.కు ఉత్తమ ప్రతిభ అవార్డు





-80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉన్నతాధికారులతో ఉత్తమ పురస్కారం

ఆత్మకూరు ఆగస్టు 19 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లా ఆత్మకూరు డివిజన్ విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కే.మహేష్ (జే.యల్.యం) కు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా.ఉత్తమ ప్రతిభ,సేవా పురస్కారాన్ని జిల్లా విద్యుత్ పర్యవేక్షణ అధికారి జి.సుధాకర్ చేతుల మీదుగా అవార్డు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు, గురువారం పట్టణంలోని విద్యుత్ శాఖ ఎఇ పి. ప్రభాకర్ ఆధ్వర్యంలో. ఉత్తమ ప్రతిభ, సేవలం దించిన కే.మహేష్ కు పూలమాలలతో శాలువలతో ఘనంగా సన్మానించారు వీరితోపాటు తోటి ఉద్యోగులు కార్మికులు హాజరై విజయవంతం చేశారు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులు సమిష్టిగా కృషి చేసిన, సంస్థ పురోభివృద్ధికి పాటుపడి, విద్యుత్ వినియోగదారులకు తమ వంతు విశేష సేవలందించి, సంస్థ కు వన్నె తెచ్చి, సంస్థను అభివృద్ధి పథంలో నిడిపించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని అన్నారు.

# కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం





-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి ఆదేశాలతో కార్యక్రమం

ఆత్మకూరు ఆగస్టు19 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వద్ద రామాపురం గ్రామంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి లక్షణాలు, దోమల నిర్మూలన గురించి ఆరోగ్య కార్యకర్త బి. విశ్వనాథ్ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలలో దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే 2030 కి దేశంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలన జరుగుతుందని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇంటి పరిసరాలలో, తమ ఇంట్లో దోమల ఆవాసాలను గుర్తించి నాశనం చేయడం ద్వారా దోమల నిర్మూలన జరిగి వాటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్ట వచ్చని తద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ ను నిర్మాణం చేయడం సాధ్యమని తెలిపారు. ప్రభుత్వాలు, ప్రజలు కీలకంగా వ్యవహరించి తమ వంతు కర్తవ్యంగా దోమల నివారణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు , కల్పలత, ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ముందస్తు ప్రణాళిక అవసరం






-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

నంద్యాల, ఆగస్టు 19 వార్త సాక్ష్యం

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో, సమన్వయంతో పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మందస్తు చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా, డి పి ఓ, జెడ్పి సీఈవో మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ. జిల్లాలో గ్రామ పంచాయతీలు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పుడు వరకు చేపట్టవలసిన ఎన్నికల మందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యంత బాధ్యతాయుతమైన, సమయ పరిమితితో కూడుకున్న ప్రక్రియ అని గ్రామపంచాయతీ ఎన్నికల ప్రారంభ దశ నుండి ముగింపు దశ వరకు సమస్యలు తలెత్తకుండా ప్రతి అంశంపై ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. తమ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలు మౌలిక వసతుల అవసరాలు పోలింగ్ కేంద్ర పరిస్థితులు తదితర అంశాలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అధికారులు కచ్చితంగా పాటించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ కు వివరిస్తూ జిల్లాలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లను, జిల్లాలో ఎన్నికల సన్నాహక చర్యలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్ల జాబితాల తయారీ, ఎన్నికల సామగ్రి సమీకరణ, శాంతిభద్రతల ఏర్పాట్లపై జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల తనిఖీ ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే స్పష్టత వచ్చిందని, నిర్ణయించిన కాలపట్టిక ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సంబంధించిన రిజర్వేషన్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను ఆగస్టు 22వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.జిల్లాలో మొత్తం 12 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, జెడ్పీటీసీ స్థానాల జాబితా, గుర్తింపు, కేటాయింపు ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు..పంచాయతీరాజ్ ఎన్నికల సన్నాహాలు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో తొలిసారిగా 20 వార్డులకు సమగ్ర ఓటర్ల జాబితా ఇంటిగ్రాటెడ్ రోల్ ను ప్రచురించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని 7 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ప్రతిపాదనలను పంచాయ తీరాజ్ కమిషనర్‌కు పంపినట్లు వివరించారు. ఓటర్ల జాబితాల తయారీ, పరిశీలన, ప్రచురణ ప్రక్రియలను నిర్ణీత కాలపట్టికకు అనుగుణంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సమగ్ర ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 3వ తేదీన సమగ్ర ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ప్రతిపాదనలు ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సుల సంఖ్యను ముందుగానే అంచనా వేసి అదనపు బ్యాలెట్ బాక్సుల అవసరాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అవసరమైన అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి సకాలంలో అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి జిల్లాలోని కొన్ని ప్రాంతాల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జెడ్పీ సిఈఓ, మున్సిపల్ అధికారులు, డిపిఓతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సులు సరిగ్గా ఉన్నాయా లేదా ? ఎస్సీ, ఎస్టీ, బీసీ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అంతేకాకుండా సున్నితమైన ప్రాంతాల్లో కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,వైయస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

-శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ విప్‌గా అవకాశం కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నంద్యాల ఆగస్టు 19 వార్త సాక్ష్యం

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం టిఫిన్ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మర్యాద పూర్వకంగా కలిశారు.ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విప్‌గా తనకు అవకాశం కల్పించినందుకు మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఇసాక్ బాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకుంటూ, శాసనమండలిలో పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా పనిచేస్తానని, తనకు అప్పగించిన విప్ బాధ్యతలను చిత్తశుద్ధి, నిబద్ధతతో నిర్వహిస్తానని ఇసాక్ బాషా తెలిపారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు ఇసాక్ బాషాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆత్మకూరు కొత్తపల్లె పాములపాడు వెలుగోడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి



ఆత్మకూరు ఆగస్టు 19 వార్త సాక్ష్యం

ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాలు డిమాండ్: ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్, రైతు సంగం మండల కార్యదర్శి వీరన్న ఆత్మకూరు మండలం కొత్త రామాపురం గ్రామంలో పంటల బీమా పకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకొని నష్టపరిహారం ఇవ్వాలని 22వ తారీఖున వ్యవసాయ కార్యాలయం( ఏ డి ఏ ) వద్ద జరిగే ధర్నాలో రైతులు కౌలు రైతులందరూ పాల్గొని రైతులు వేసిన పంటలకు నష్టపరిహారం ఎల్లీనో ప్రభావంతో పంటలు వేయని రైతులకు, కౌలు రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కరపత్రాలు పంచి, వ్యక్తిగత అర్జీలు కూడా తీసుకొని రావాలని రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా పి సుధాకర్ మాట్లాడుతూ అన్ని రకాల పంటలకు పంటల బీమా వర్తింపజేయాలని భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ పంటల బీమా వర్తింప జేయాలని, ఉపాధి కూలీలకు700 రూపాయలు కూలి ఇవ్వాలని, 250 రోజులు పని దినాలు కల్పించాలని , చిన్నా సన్నకారు రైతులకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కరువు ప్రాంతాల్లో గడ్డి కేంద్రాల ద్వారా పశుగ్రాసం ఉచితంగా ఇవ్వాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు కౌలు రైతులు నాయినేని ఎల్లారెడ్డి, వి ప్రసాద్, జె నాగ స్వామి నాయక్, లక్ష్మణ నాయక్, నాయక్, సామన్న, బి వాసు, జి లోకేశ్వర్లు, ఆవులపాటి వెంకటేశ్వర్లు, కే గోపాలకృష్ణ పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు డి.నారాయణ రెడ్డి డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోండి

-కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి

పాములపాడు ఆగస్టు 19 వార్త సాక్ష్యం



మండల కేంద్రమైన పాముల పాడులోని, డి నారాయణ రెడ్డి డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని కరస్పాం డెంట్ దుగ్గెంపూడి.నారాయణరెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అన్నారు. మా కళాశాలలో బి.ఎ. హానర్స్ (హిస్టరీ), బి.ఎ. హానర్స్ (స్పెషల్ ఉర్దూ), బీకాం హానర్స్ (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ హానర్స్ (బాటని), బీఎస్సీ హానర్స్ ఎమ్.ఎల్.టి (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ), బిఎస్సి హానర్స్ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీ కోర్సులకు రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు ఎవరైనా సరే దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. డిగ్రీ కాలేజీ రాయల సీమ యూనివర్సిటీ అనుబంధ సంస్థ అని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాములపాడులోని, ఆత్మకూరు వైపు ఉన్న, కే.జీ.రోడ్డు ప్రక్కన మా డిగ్రీ కళాశాలకు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు కరస్పాండెంట్-944 100 0034, 9441000035 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు సంప్రదించాలని తెలియజేశారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## అంగన్‌వాడి పిల్లలందరికీ ఆధార్ తప్పనిసరి

**-5--7, 15--17 ఏళ్లలో బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం**
**-పెండింగ్ ఆధార్ నమోదుకు నెల రోజుల్లో ప్రత్యేక చర్యలు**
**-ప్రతి నాలుగో శనివారం కలెక్టరేట్‌లో ఆధార్ క్యాంప్**

నరసరావుపేట, ఆగస్టు 19 వార్త సాక్ష్యం



అంగన్‌వాడి కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పేరెంట్ బయోమెట్రిక్‌తో చేసిన ఆధార్‌ను ఐదేళ్ల తర్వాత తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలని సూచించారు. ఆధార్ లేని పిల్లలు అంగన్‌వాడుల్లో ఉండకూడదని స్పష్టం చేశారు.

**-పిల్లల జాబితా సిద్ధం చేయాలి**

బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడిలో ఎంతమంది పిల్లలు ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని శిశు సంక్షేమ శాఖ పీడీని ఆదేశించారు. గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాల వారీగా పిల్లల వివరాలను సూపర్‌వైజర్ల ద్వారా సేకరించి, డీఎల్‌డీవోలతో సమన్వయం చేసుకుని ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

**-సంక్షేమ పథకాలకు ఆధార్ అవసరం**

పాఠశాలల్లో అడ్మిషన్ల సమయంలో ఆధార్ నంబర్ అవసరమవుతుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలకు కూడా ఆధార్ అవసరమవుతుందని పేర్కొన్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, బొల్లాపల్లి మండలాల్లో ఆధార్ నమోదులు, అప్‌డేట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని.. నెల రోజుల్లో వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

**-51,823 మంది ఆధార్ వివరాలు**

జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ యూడైస్ పరిధిలో 3,19,646 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. 0--15 ఏళ్లలోపు 28,830 మంది, 15 ఏళ్లు పైబడిన 20,246 మంది పిల్లల ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 51,823 మంది ఆధార్ నమోదులు పూర్తయినట్లు తెలిపారు.

**-రెండు దశల్లో బయోమెట్రిక్**

5--17 ఏళ్లలోపు పిల్లలకు ముందుగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. పిల్లలకు ఆధార్‌లో రెండు బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉంటాయని అధికారులు తెలిపారు. 5--7, 15--17 సంవత్సరాల మధ్య ఉచితంగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆధార్ అప్‌డేట్ పెండింగ్ ఎక్కువగా ఉందని, క్యాంపులు నిర్వహించేందుకు అనుమతులు త్వరగా లభించడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆధార్ క్యాంపులు నిర్వహించాల్సిన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నాలుగో శనివారం కలెక్టరేట్‌లో ఆధార్ క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పేకాట క్లబ్‌ను వెంటనే మూసివేయాలి

**-డీఎస్పీకి వినతిపత్రం అందజేసిన వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల**



సత్తెనపల్లి,ఆగస్టు 19 వార్త సాక్ష్యం

సత్తెనపల్లి పట్టణంలో అధికార రాజకీయ అండతో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వైకాపా సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి బుధవారం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. పేకాట క్లబ్‌ను వెంటనే మూసివేసి, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.వైకాపా కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లిన గజ్జల.. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. గతంలో పోలీసులు పేకాట క్లబ్‌పై దాడి చేసి కొంత నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ.. రాజకీయ అండతో తిరిగి క్లబ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు.వివిధ ప్రాంతాల నుంచి పేకాట ఆడేందుకు పలువురు సత్తెనపల్లికి వస్తున్నారని, పేకాట కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని గజ్జల పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని క్లబ్‌ను తక్షణమే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌తో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకం






**-జిల్లా పర్యటక శాఖ అధికారి సునీల్ కన్నా**

నంద్యాల ఆగస్టు 19 వార్త సాక్ష్యం

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని జిల్లా పర్యాటకశాఖ అధికారి డాక్టర్ ఏ.సునీల్ కన్నా కొనియాడారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్లో టాక్సీ, బస్సు, ఆటో డ్రైవర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే యాత్రికులు మరియు ప్రయాణికుల తో ఎలా ప్రవర్తించాలి వారి అవసరాలు ఎలా తీర్చాలి అనే అంశాలపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి జస్వంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు పర్యాటక ప్రాంతాల్లో సేవలందిస్తు న్నటువంటి సర్వీస్ ప్రొవైడర్లకు ఈ శిక్షణ ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు అందులో భాగంగా నంద్యాల పట్టణంలోని బస్సు ఆటో టాక్సీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. డ్రైవర్లకు తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవి ద్యాలయం హోటల్ మేనేజ్మెంట్ కళాశాలకు చెందినటువంటి అధ్యాపకులు డాక్టర్ వి. తిమ్మప్ప, భార్గవి, శివరామకృష్ణ,డ్రైవర్లకు పర్యాటకల తో ఎలా ప్రవర్తించాలి, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి అనే అంశాలపై శిక్షణనిచ్చారు. అనంతరం డ్రైవర్లకు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు సర్టిఫికెట్లు అందించారు.

## కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి






**-కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు**
**-జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను వివరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

కర్నూలు, ఆగస్టు 19 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహణకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.బుధవారం విజయవాడ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఎన్నికల నిర్వహణ బాధ్యతాయుతమైన ప్రక్రియ అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశంపై ముందుగానే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది శిక్షణ తదితర ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (EMS) ద్వారా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, స్వీప్ కార్యక్రమాలు, పరిశీలకుల నియామకం, నామినేషన్లు, నోటీసులు తదితర ఎన్నికల ప్రక్రియలను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, లోపాలు, గ్యాప్‌లను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి దశకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలను ముందస్తుగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది, ఎన్నికల సామగ్రి, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు..పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, ప్రచురణ ప్రక్రియను కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అష్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్ (AMF) అందుబాటులో ఉండేలా ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**-జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను వివరించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాకు సుమారు 3,500 బ్యాలెట్ బాక్సులు అవసరమవుతాయని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక ఎంపీడీవో పోస్టును భర్తీ చేయాల్సిన అవసరాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బందికి శిక్షణ, ఎన్నికల విధుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడం తదితర ఏర్పాట్లను చేపడుతున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలు, గ్యాప్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పూరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, విద్యుత్, ర్యాం పులు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు ప్రణాళికతో ఎన్నికల ఏర్పాట్లు కొనసాగిస్తు న్నామని తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ భాస్కర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



యద్దనపూడి

తెలుగుదేశం పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన తారక రామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు మండల పార్టీ అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తారక రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తారక రామారావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకె ళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేసే నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా తారక రామారావు పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరినీ కలుపు కొని సమన్వయంతో పనిచేస్తూ యద్దనపూడి మండ లంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో తారక రామారావు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# శ్రీశైలం టిడిపి పార్టీలో నేటికీ... అలక రాజకీయాలు తొలగిపోయేనా...!?





**-స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాయకులంతా ఐక్యత అయ్యేనా.**
**-శ్రీశైలం నియోజకవర్గం లో జరుగుతున్న రాజకీయాలపై అధికార పార్టీలో అసంతృప్తి.**
**-త్వరలోనే కమిటీల్లో చేర్పులు మార్పులు.**
**-నమ్మిన నాయకుడికి వెన్నుపోటు రాజకీయాలు. నేతల్లో మార్పు రాకపోతే యువతకు అవకాశం.**
**-ప్రత్యర్థుల రాజకీయాలను తిప్పి కొట్టే విధంగా రాజకీయ వ్యూహం.**
**-నియోజకవర్గస్థాయిలో ప్రాజెక్టులు రహదారులు పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి.**
**-నమ్మి పదవులు ఇస్తే ప్రజలకు దూరమవుతున్న కీలక నాయకుల రాజకీయం**

ఆత్మకూరు,ఆగస్టు 19 వార్తసాక్ష్యం

తెలుగుదేశం పార్టీ కోసం 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ జెండా మోసిన నాయకుడు నుండి కార్యకర్త వరకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని పార్టీ పెద్దలు చెప్పిన మాటలను దృష్టిలో ఉంచుకొని టిడిపి పార్టీ గెలుపు కోసం సిబిఎన్ సైన్యం తో కలిసి పెద్ద ఎత్తున గెలుపు సాధించారు సాధించారు ఈ నేపథ్యంలోనే సీనియర్ టిడిపి నేతలకు రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న నీటి సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలకే అవకాశం కల్పించారు బాధ్యతలు చేపట్టి రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా వ్యవహరించారు. ప్రస్తుతం తాజా రాజకీయాల దృశ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతలు పట్టు సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారా లేక నమ్ముకున్న ప్రజా ప్రతినిధి పై అసంతృప్తి రాజకీయాలు మొదలయ్యాయి అనే విషయం నేటికీ అంతుచిక్కడం లేదు అందరినీ ఆదరించాడు ప్రేమ అనురాగాలు చూపించాడు నమ్మినవారికి పదవులు ఇచ్చాడు కేవలం రాజకీయంలో పదవుల అలంకరణ ఉంటేచాలా అనే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఒకవైపు నియోజకవర్గం లో అభివృద్ధి సంక్షేమం రైతన్న శ్రేయస్సు కోసం పాటుపడుతూ ప్రాజెక్టులు చెరువులు అభివృద్ధి చేసే దిశగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి నియోజక అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రజాప్రతినిధికి నేటికీ నమ్ముకున్న నేతలే వెన్నుపోటు రాజకీయాలు చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యం లోనే శ్రీశైలం నియోజకవర్గం లోని టిడిపి పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర ఓ నామినేటెడ్ పదవిలో ఉన్న నాయకుడు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు కొందరు ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. అయితే ఆయన ఓ పుణ్యక్షేత్రానికి సీనియర్ నాయకులుగా రాజకీయాలు కొనసాగించారు. ఇలాంటి సీనియర్ నేతలు ఎందరో పార్టీ కార్యక్రమాలకు దూరమవుతున్నారు.

**-టిడిపి పార్టీలో నేటికీ అలక రాజకీయాలు తొలగిపోయేన..!?**

పార్టీ కోసం కలిసికట్టుగా పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అని చెప్పవచ్చు అయితే శ్రీశైలం నియోజకవర్గం లో అసంతృప్తి రాజకీయాలు నాయకుడు ముందు ఒక మాట నాయకుడు లేకపోతే మరో మాట చెప్పుకుంటూ ప్రజల్లో అసంతృప్తి రాజకీయాలు చేస్తున్న నేపథ్యంలో సీనియర్ నాయకులు అలక రాజకీయాలు వీడేనా అంటూ తెలుగుదేశం పార్టీ నేతల్లో గుసగుసలు మొదలయ్యాయి నమ్ముకున్న పార్టీ నాయకులకు కార్యకర్తలకు కంటి తుడుపు పదవులు అందించి అసంతృప్తి రాజకీయాలు కొనసాగుతూనే ఉన్నాయి. అందరూ నా వల్లే కదా అని నమ్మి బాధ్యతలు అప్పగిస్తే ప్రజల దగ్గరికి వెళ్తే ఈ నాయకులను చూసి ఒక్కరు కూడా ఓటు వేసే పరిస్థితి కనిపించడం లేదు ప్రజలకు ఏమి కావాలి ఏమి ఇవ్వాలి అనే సమస్యలు తెలుసుకునే నాయకుడే కరువయ్యారు. కేవలం కొందరు నాయకులు చేసే రాజకీయాలకు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పరిమితమైందని చెప్పవచ్చు. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో జరుగుతున్న అసంతృప్తి రాజకీయాలు అలకలపై ప్రజా ప్రతినిధి ప్రత్యేక దృష్టి సారించి తనదైన శైలిలో జరిగే రాజకీయ వ్యూహం ఏర్పాటు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతారా లేకుంటే అసంతృప్తితో జరుగుతున్న రాజకీయ నాయకులను కమిటీలలో తప్పించి తెలుగుదేశం పార్టీ కోసం ఉత్సాహంగా పనిచేస్తున్న యువతరానికి పార్టీ పగ్గాలు అప్పగిస్తారా అనే విషయాన్ని వేచి చూద్దాం.

# ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న జనరేషన్ జీ

**-మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు**

గుంటూరు ఆగస్టు 19 వార్త సాక్ష్యం

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలను ప్రభావితం చేసే శక్తి యువతకే ఉందని మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలతో పాటు ఇటీవల తమిళనాడులో ప్రభుత్వాల మార్పులోనూ 'జనరేషన్ జీ' కీలకపాత్ర పోషించిందని తెలిపారు.బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'జనరేషన్ జీ ఉద్యమంపై విశ్లేషణ' చర్చాగోష్ఠికి వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుజ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ 1997--2012 మధ్య జన్మించిన యువతను జనరేషన్ జీగా పిలుస్తారని వివరించారు. స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేయడం, తమ ఆలోచనలకు అనుగుణంగా వేగంగా ఫలితాలు సాధించేందుకు పోరాడటం వారి ప్రత్యేకతగా పేర్కొన్నారు.ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లోనూ జనరేషన్ జీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొందన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.



రానున్న రోజుల్లో ప్రపంచ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగల సామర్థ్యం యువతకు ఉందని పేర్కొన్నారు.జనచైతన్య వేదిక అధ్యక్షుడు రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్‌ను యువత ఒక సాధనంగా ఉపయోగించుకుంటో ఒదన్నారు. సామాజిక సమస్యలపై కోట్లాది మంది యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో సోషల్ మీడియా కీలకంగా మారిందని తెలిపారు.

**-విద్యపై దృష్టి పెట్టాలి**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరుతూ జనరేషన్ జీ కొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సమాజంలోని ప్రధాన సమస్యలపై అందరినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా మార్చబోమని ప్రకటించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి. సేవాకు మార్, అవగాహన వ్యవస్థాపకుడు కొండా శివరామి రెడ్డి, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీనివా సరావు, వేదిక నేత పి. వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు పి.ఎస్. మూర్తి, వల్లూరి సదాశివరావు, ఎన్. భావనారాయణ, నంది కాంత్, వి.వి.కె. సురేష్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వట్టిచెరుకూరు చెరువు పనులు తనిఖీ చేసిన కలెక్టర్

**-రూ.50 లక్షలతో అభివృద్ధి.. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దేలా పనులు**

గుంటూరు,ఆగస్టు 19 వార్త సాక్ష్యం

వట్టిచెరుకూరు ఊర చెరువు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ బుధవారం తనిఖీ చేశారు. 'ప్రతి ఒక్కరికీ నీరు' లక్ష్యంతో ప్రధానమంత్రి కృషి సంచయి యోజన కింద రూ.50 లక్షలతో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు.చెరువును ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. చిన్నారుల కోసం ఆట పరికరాలు, పెద్దలు సేదతీరేందుకు బెంచీలు, గట్టు చుట్టూ మొక్కలు, వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చెరువును చక్కటి పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

**-14, 7 ఎకరాల్లో అభివృద్ధి**

ఊర చెరువు చుట్టుపక్కల దాదాపు 100 ఎకరాల్లో చిన్నచిన్న చెరువులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రధాన చెరువులో 14 ఎకరాల విస్తీర్ణంలోని ఒక భాగం, మరో 7 ఎకరాల భాగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అప్పాపురం ఛానల్ నుంచి గ్రావిటీ ద్వారా నిత్యం నీరు చెరువులోకి చేరడం అదనపు ప్రయోజనమని పేర్కొన్నారు.



**-ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి**

చెరువును పరిరక్షిస్తున్న విధానం, పూడికతీత పనుల వివరాలను గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ చెరువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా గ్రామస్తులు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్లు లేని వారికి పట్టాల పంపిణీపై దృష్టి సారించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కె. శ్రీనివాసరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జడ్పీ సీఈవో వి. జ్యోతి బసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. కళ్యాణ చక్రవర్తి, డీపీవో బి.వి. నాగసాయి కుమార్, మండల తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జీఎస్టీ వసూళ్లపై కలెక్టర్ సమీక్ష

**-ప్రొఫెషనల్ ట్యాక్స్ పరిధిలోకి ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రుల సిబ్బంది**
**-చెక్‌పోస్టుల్లో సిబ్బందిని రొటేషన్ పద్ధతిలో నియమించాలని ఆదేశం**

నరసరావుపేట, ఆగస్టు 19 వార్త సాక్ష్యం



పల్నాడు జిల్లాలో జీఎస్టీ అమలు, పన్నుల వసూళ్లపై జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహి ంచారు. జిల్లాలో జీఎస్టీ వసూళ్ల పురోగతి, వాహన తనిఖీలు, ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు అవసరమైన వివరాలపై అధికారులతో చర్చించారు.కలెక్టర్ కార్యాలయంలోని బీసీ సమావేశ మందిరం నుంచి జీఎస్టీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. జిల్లాలో జీఎస్టీ అమలు తీరు, వసూళ్ల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మూడు సర్కిళ్లలో సత్తెనపల్లి సర్కిల్‌లో జీఎస్టీ వసూళ్లు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.14,786.57 లక్షల లక్ష్యానికి గాను జూలై వరకు రూ.8,510.89 లక్షలు వసూలైనట్లు వెల్లడించారు. 2025--26లో ఇదే కాలానికి రూ.9,172.21 లక్షలు వసూలు కాగా, ప్రస్తుతం -7.22 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. వాహన తనిఖీల ద్వారా జూలై 2026 వరకు రూ.40.09 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వివరించారు.

**-ప్రొఫెషనల్ ట్యాక్స్‌పై దృష్టి**

ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగుల వివరాలను సేకరించి ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామాపురం, తంగెడ, వి.పీ. సౌత్ కమర్షియల్ ట్యాక్స్ చెక్‌పోస్టుల వద్ద రొటేషన్ పద్ధతిలో సిబ్బందిని నియమించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.జిల్లాలో కాంట్రాక్టర్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే ప్లాంట్ ఆఫ్ ల్యాండ్ కొనుగోలు చేస్తున్నారా లేదా అన్నది అన్ని ఇంజినీరింగ్ విభాగాలు పరిశీలించాలని జీఎస్టీ అధికారులు సూచించారు. జిల్లాలో కేటాయించిన మొత్తం పనుల వివరాలు, కొత్త పరిశ్రమల జాబితాను జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి అందించాలని కోరారు.

**-జీఎస్టీ టీడీఎస్ చెల్లింపుపై ఆదేశాలు**

పంచాయతీరాజ్ శాఖ ద్వారా చెల్లించాల్సిన జీఎస్టీ టీడీఎస్‌ను సకాలంలో జమ చేసేలా అన్ని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జీఎస్టీ టీడీఎస్ జమ చేయకపోవడం, జీఎస్టీఆర్--7 దాఖలు చేయకపోవడంపై డీపీవో, ఎంపీడీవోలకు తగిన సూచనలు చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకుల ప్రాథమిక సమాచారం, బకాయిల వివరాల సేకరణకు సహకరించాలని అధికారులు కోరారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల జాతీయ గుర్తింపు కార్డులు, ఈ-మెయిల్ ఐడీలు, ఈ-ఆఫీస్ ఆధారాలు, మ్యాపింగ్ వివరాలను అందించాలని సూచించారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు సంబంధించి ఆర్డీవోల నుంచి తాకట్టు దళారుల జాబితా, లీడ్ బ్యాంకు మేనేజర్ నుంచి ఏటీఎంలు, బ్యాంకుల వివరాలు సేకరించాలని అధికారులు కోరారు.

# గుంటూరులో దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు




గుంటూరు,ఆగస్టు 19 వార్త సాక్ష్యం

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నగరంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 4 మలేరియా డివిజన్లలో 203 మంది సిబ్బందితో యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది ఇప్పటివరకు మలేరియా 4, డెంగ్యూ 51, చికున్‌గున్యా 8 కేసులు నమోదవగా, ఈ ఏడాది మలేరియా కేసులు శూన్యానికి, డెంగ్యూ 26, చికున్‌గున్యా ఒక కేసుకు తగ్గాయని తెలిపారు. నీటి నిల్వలను తొలగించడం, యాంటీ లార్వా చర్యలు, అవసరమైన చోట్ల ఫాగింగ్, డ్రోన్ స్ప్రేయింగ్ చేపడుతున్నామన్నారు. సుమారు 15 లక్షల గంబూసియా చేపలను నీటి వనరుల్లో వదిలి జీవ నియంత్రణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ సూచించారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 20 ఆగష్టు 2026

# బిజినెస్

# మీ స్టార్టప్‌కు నిధులు కావాలా ఈ ప్రభుత్వ పథకాలపై ఓ లుక్కేయండి!

భారతదేశంలో స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు చేయూతనివ్వడానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తోంది. ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ తయారీ, వెంచర్ క్యాపిటల్, రుణాల సమీకరణ వరకు వివిధ దశల్లో ఈ పథకాలు అండగా నిలుస్తున్నాయి. అయితే, ప్రతి పథకం అందించే సహాయం, దాని స్వరూపం వేర్వేరుగా ఉంటాయి. అన్ని పథకాలు నేరుగా వ్యవస్థాపకుల చేతికి డబ్బును అందించవన్న విషయాన్ని గమనించాలి. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అనేక గణాంకాలు పాతవి లేదా తప్పు అని అధికారిక సమాచారం స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన పథకాలలో నిధి-ప్రయాస్, సమృద్ధి, టైడ్ 2.0, స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్, క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్ , క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. ఈ పథకాలపై పూర్తి అవగాహనతో ముందడుగు వేయడం వ్యవస్థాపకులకు ఎంతో అవసరం.

### ప్రోటోటైప్, ప్రారంభ దశ కోసం పథకాలు

నిధి-ప్రయాస్ 2.0: సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కింద పనిచేసే ఈ పథకం, వినూత్న ఆలోచనలను ప్రోటోటైప్‌లుగా మార్చడానికి సహాయపడుతుంది. నిధి-ప్రయాస్ 2.0 కింద, టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలకు ఒక్కో స్టార్టప్‌కు గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు ప్రోటోటైప్ ఫండింగ్ లభిస్తుంది. డీప్‌టెక్ వంటి అధునాతన ప్రోటోటైప్‌ల కోసం 'అడ్వాన్స్ ప్రయాస్ సెంటర్లు' రూ. 40 లక్షల వరకు సాయం అందిస్తాయి. గతంలో ఈ పథకం కింద గరిష్ఠ పరిమితి రూ. 10 లక్షలు మాత్రమే. ఇది మహిళల స్టార్టప్‌లకు రూ. 10 కోట్ల ఈక్విటీ ఫండింగ్ ఇచ్చే పథకం అని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. సమృద్ధి : ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈ పథకం, ఐటీ ఆధారిత స్టార్టప్‌లు వేగంగా ఎదిగేందుకు తోడ్పడుతుంది. ఎంపికైన స్టార్టప్‌లకు యాక్సిలరేటర్ల ద్వారా రూ. 40 లక్షల వరకు మ్యాచింగ్ ఫండింగ్ సపోర్ట్ అందిస్తుంది. కస్టమర్లు, ఇన్వెస్టర్లతో కనెక్ట్ అవ్వడానికి కూడా ఈ పథకం సహాయపడుతుంది.

టైడ్ 2.0: ఇది కూడా మీవత్ పరిధిలోనిదే. టెక్నాలజీ స్టార్టప్‌లకు ప్రారంభ దశలో నిధులు, ఇంక్యుబేషన్, మెంటరింగ్ అందిస్తుంది. ఆలోచనను ప్రాథమికంగా నిరూపించడానికి (ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్) రూ.4 లక్షల వరకు, ప్రోటోటైప్ అభివృద్ధికి రూ. 7 లక్షల వరకు గ్రాంట్, ఉత్పత్తి అభివృద్ధి, మార్కెటింగ్ కోసం రూ. 40 లక్షల వరకు పెట్టుబడి రూపంలో సహాయం లభిస్తుంది.

### పెట్టుబడులు, వెంచర్ క్యాపిటల్ కోసం

స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్: ప్రభుత్వం నేరుగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టకుండా, సెబీ గుర్తింపు పొందిన వెంచర్ ఫండ్స్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రూ. 10,000 కోట్ల కార్పస్‌తో ప్రారంభమైన ఈ పథకం కింద, 2025 మార్చి 31 నాటికి 153 ఏఐఎఫ్‌లకు రూ. 11,808 కోట్లు కేటాయించినట్లు సిడ్బీ నివేదించింది. ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0: 2026 ఏప్రిల్‌లో రూ. 10,000 కోట్ల కార్పస్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇది కూడా ఏఐఎఫ్‌ల ద్వారానే స్టార్టప్‌లలో పెట్టుబడులు పెడుతుంది. ముఖ్యంగా డీప్‌టెక్, వినూత్న తయారీ రంగం, ప్రారంభ దశలోని స్టార్టప్‌లపై ఇది దృష్టి పెడుతుంది. స్టార్టప్‌లు నేరుగా ప్రభుత్వానికి కాకుండా, ఈ పథకం కింద ఎంపికైన ఏఐఎఫ్‌లను పెట్టుబడుల కోసం సంప్రదించాలి.



### రుణాల కోసం ప్రభుత్వ హామీ పథకాలు

క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్ : ఇది స్టార్టప్‌లకు నేరుగా రుణాలు ఇవ్వదు. డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నప్పుడు, ఆ రుణానికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం హామీ ఇస్తుంది. దీనివల్ల బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయి. సవరించిన నిబంధనల ప్రకారం, ఒక్కో స్టార్టప్‌కు రూ.20 కోట్ల వరకు తీసుకునే రుణాలకు ఈ హామీ వర్తిస్తుంది. రూ.10 కోట్ల వరకు రుణంలో 85 శాతం, ఆపైన రుణంలో 75 శాతం డిఫాల్ట్ మొత్తానికి ప్రభుత్వం హామీ ఇస్తుంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఈ పథకం కూడా రుణ హామీని మాత్రమే అందిస్తుంది. సభ్యులుగా ఉన్న బ్యాంకులకు, వారు ఇచ్చే రుణాలకు ఇది హామీ ఇస్తుంది. ప్రస్తుతం ఒక్కో సంస్థకు రూ.10 కోట్ల వరకు తీసుకునే రుణాలకు ఈ గ్యారెంటీ వర్తిస్తుంది. 2025లో ఈ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు పెంచారు. మొత్తం మీద, ప్రభుత్వ మద్దతు అనేది గ్రాంట్, పెట్టుబడి, మ్యాచింగ్ ఫండింగ్, రుణ హామీ వంటి పలు రూపాల్లో ఉంటుందని వ్యవస్థాపకులు గ్రహించాలి. ఒక పథకం కింద ప్రకటించిన గరిష్ఠ మొత్తం ప్రతి ఒక్కరికీ లభించే నగదు కాదని, అర్హత నిబంధనలు, ఎంపిక ప్రక్రియ, వ్యాపార దశ, సంబంధిత ఇంక్యుబేటర్ లేదా బ్యాంకు వంటి అనేక అంశాలపై అందే సహాయం ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

# శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్

# క్రీడలు

**శ్రీలంక గడ్డపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన సుతార్**

**దిగ్గజ బౌలర్లు హర్భజన్, అశ్విన్‌లను అధిగమించిన యువ స్పిన్నర్**

**గాలే టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**

శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

### మ్యాచ్ సాగిందిలా..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### సుతార్ స్పిన్ మ్యాజిక్

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను




కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.

# గాలే టెస్టులో భారత్ ఘన విజయం.. సుతార్ స్పిన్ మాయకు లంక చిత్తు!

**గాలే టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**

**రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్**

**మొదటి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీతో భారత్‌కు భారీ ఆధిక్యం**

**ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన టీమిండియా**

**ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 12 కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్**

శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (6/55) అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఖాతాలో 12 కీలక పాయింట్లను జమ చేసుకుంది. భారత జట్టుకు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం, గాలే స్టేడియానికి 50వ టెస్టు కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది. నేడు ఐదో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక 77.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. లంచ్ విరామం తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనాల్ దినుష, కేశర నువంత



కొద్దిసేపు భారత బౌలర్లను నిలువరించారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన దినుష (84) మరోసారి అద్భుతంగా ఆడి, రెండో సెంచరీ దిశగా సాగుతున్నట్లు కనిపించాడు. ఈ దశలో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందేమోననిపించింది. అయితే, యువ కెరటం మానవ్ సుతార్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 76వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన సుతార్, ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించాడు. ఆ ఓవర్లో దినుషను లెగ్ గల్లీలో ధ్రువ్ జురెల్ క్యాచ్ ద్వారా ఔట్ చేసి కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని లహిరు కుమార ఎదుర్కొన్నప్పటికీ, రెండు బంతుల తర్వాత అతనిని కూడా కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తన రెండో టెస్టులోనే రెండోసారి ఐదు వికెట్ల ఘనతను సుతార్ అందుకున్నాడు. ఆ తర్వాత కొద్దిసేపు నువంత (20) పోరాడినా.. 78వ ఓవర్లో అతడిని కూడా బౌల్డ్ చేసిన సుతార్, భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మ్యాచ్‌లో సుతార్ మొత్తం 101 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు. భారత్ విజయానికి తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సాధించిన అద్భుతమైన సెంచరీ (167) బలమైన పునాది వేసింది. అతని ఇన్నింగ్స్ వల్లే భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ (66) కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ స్కోరుతో భారత్ బౌలర్లు టర్నింగ్ పిచ్‌పై లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని ఖాయం చేశారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## మీడియాతో మాట్లాడకుండా ఈడీ కార్యాలయం నుంచి వెళ్లిపోయిన నిధి అగర్వాల్

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో టాలీవుడ్ కథానాయిక నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారుల ఎదుట హాజరైన ఆమెను ఈడీ బృందం సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. ప్రధానంగా 'జీత్ విన్' లాంటి గేమింగ్ యాప్‌ల ప్రచారంలో ఆమె భాగస్వామ్యంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఒప్పందాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు..ప్రమోషన్స్ కోసం ఆమె అందుకున్న భారీ పారితోషికం వివరాలు, ఆ నగదు హవాలా మార్గంలో వచ్చిందా లేక బ్యాంకింగ్ లావాదేవీల ద్వారా చెల్లించారా అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు సమాచారం.దేశంలో వేల కోట్ల రూపాయల మనీ లాండరింగ్‌కు పాల్పడుతూ, అక్రమంగా విదేశాలకు నిధులు తరలిస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ఈడీ ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగానే ఈ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వరుసగా నోటీసులు ఇస్తూ విచారిస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత ఈడీ ఆఫీస్ నుంచి బయటకు వచ్చిన నిధి అగర్వాల్‌ను మీడియా ప్రతినిధులు చుట్టుముట్టినప్పటికీ, ఆమె ఏ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మౌనంగా తన కారులో వెళ్లిపోయారు.



# ఆ వ్యక్తితో ప్రేమలో ఉన్నప్పుడు తీవ్ర క్షోభకు గురయ్యాను: అనుపమ పరమేశ్వరన్

నటి అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్‌కి సంబంధించిన అత్యంత చేదు అనుభవాలను బయటపెడుతూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెటిజన్లు, అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో తాను ఒక వ్యక్తితో రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న సమయంలో తీవ్రమైన మానసిక క్షోభకు గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా స్త్రీలకు సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని, అతని తప్పులను ప్రశ్నిస్తే "నీకు పీరియడ్స్ సమయమా? మూడ్ స్వింగ్స్ వల్లే ఇలా మాట్లాడుతున్నావు" అంటూ హేళన చేసేవాడని చెప్పారు. ఆ వ్యాఖ్యల వల్ల తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని, నటిగా సమాజంలో ధైర్యంగా నిలబడే తనకు ఆ సమయంలో తీవ్రమైన డిప్రెషన్ ఎదురైందని తెలిపారు.ఈ విషపూరితమైన బంధం వల్ల తన జీవిత ఆలోచనలే మారిపోయాయని ఆమె పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని కోరిక ఉండేదని, కానీ ఆ వ్యక్తి వల్ల కలిగిన చేదు అనుభవాల తర్వాత భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దనే నిర్ణయానికి వచ్చానని వెల్లడించారు. ప్రస్తుతం ఆ మానసిక క్షోభ నుంచి బయటపడి కెరీర్‌పై దృష్టి పెడుతున్నట్లు అనుపమ తెలిపిన ఈ వ్యాఖ్యలు సోషల్



మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# 'మిస్టర్ మిడిల్ క్లాస్' (ఆహా)మూవీ రివ్యూ!

కామెడీ ప్రధానమైన కథలను తెరకెక్కించడంలో దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డికి మంచి నైపుణ్యం ఉంది. 'సీమశాస్త్రి'.. 'సీమటపాకాయ్' .. 'దేనికైనా రెడీ' సినిమాలు ఆయన మార్క్ ఏమిటనేవి చూపిస్తాయి. అలాంటి ఆయన శ్రీకాంత్ కథానాయకుడిగా రూపొందించిన సినిమానే 'మిస్టర్ మిడిల్ క్లాస్'. శ్రీకాంత్ సరసన లయ నటించగా, ఇతర కీలకమైన పాత్రలలో రాజేంద్రప్రసాద్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కనిపించనున్నారు. జులై 17వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ రోజు ( ఆగస్టు 19) నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది.వెంకటరమణ (శ్రీకాంత్) పద్మావతి (లయ) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటరమణ తండ్రి ఏడు కొండలు (మురలీధర్ గౌడ్) అతని చెల్లెలు కరుణ - బావ శ్రీను కూడా అదే ఇంట్లో ఉంటారు. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన వెంకటరమణకు, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎంత మాత్రం లేని కోటీశ్వరుడు కావాలనేది కోరిక. ఆ దురాశ కారణంగానే అతను పెద్ద హోటల్ పెట్టి అప్పులపా లవుతాడు. అదే హోటల్లో ఆ ఫ్యామిలీ అంతా పనివాళ్లుగా చేరే పరిస్థితి వస్తుంది. అలా వచ్చిన డబ్బుతోనే అప్పులు తీరుస్తూ వెళుతుంటారు. ఒకానొక దశలో అతను తాను బలంగా నమ్మే వేంకటేశ్వరస్వామి గుడి దగ్గరే నైట్ వాచ్ మెన్ గా కుదురుతాడు. భార్య ఆయాగా చేరవలసిన పరిస్థితి వస్తుంది. ఆ దేవుడు ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి తనని బయటపడేయక పోవడం వలన, ఆత్మహత్య చేసుకోవాలని వెంకటరమణ నిర్ణయించుకుంటాడు. అప్పుడు ఆ స్వామి (రాజేంద్రప్రసాద్) ప్రత్యక్షమై, తన విలువైన ఆభరణాలను అతనికి ఇస్తాడు. అయితే అవి గిల్ట్ నగలు అనుకుని, పద్మావతి వాటిని చెరువులో పారేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న స్వామి, వెంకటరమణకు 13 పేజీలను కలిగిన ఒక 'బుక్' ఇస్తాడు. ఆ బుక్ లో అతను ఏది రాస్తే అది జరుగుతుందని చెబుతాడు. కొన్ని నియమాలు చెప్పి వాటి ప్రకారమే చేయాలని అంటాడు. బుక్ క్రింద పడిపోతే తన శక్తిని కోల్పోతుందని చెబుతాడు. ఆ తరువాత వెంకటరమణకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అందుకు తగినట్టుగా ఆ బుక్ లో అతను ఏమేం రాస్తూ వెళతాడు? అందువలన అతని జీవితంలో ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనేదే కథ. శ్రీమంతుల ఆలోచనలు రకరకాలుగా ఉంటాయేమోగానీ, మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన వాళ్లందరి ఆలోచ నలు దాదాపు ఒకే రకంగా ఉంటాయని అంటారు. ఉమ్మడి కుటుంబం .. అవసరాలు .. అప్పుల మధ్యలో వాళ్లు సతమతమైపోతుంటారు. ఆ ఇబ్బందుల నుంచి బయటపడటం కోసం, సాధ్యమైనంత తొందరగా డబ్బు సంపాదించాలని ఆరాటపడతారు. అలా ఆశపడే వెంకటరమణ అనే పాత్ర చుట్టూ రాసుకున్న కథ ఇది.మిడిల్ క్లాస్ కుటుంబాలకు చెందినవారు జీవితం పట్ల భయము - భద్రత రెండూ కనబరుస్తూ ఉంటారు. తమకి సహకరించమని దేవుడి పాదాలను ఆశ్రయి స్తుంటారు. అలాంటి పరిస్థితులలో దేవుడే దిగి వచ్చి వాళ్లకు వరాలను ఇస్తే, వాళ్ల తలరాతను మార్చుకునే అవకాశం వారికే ఇస్తే ఎలా ఉంటుంది? అనే ఒక ఆలోచన నుంచి ఈ కథ పుట్టిందని చెప్పుకోవచ్చు. ఆర్థికపరమైన ఇబ్బందులతో ఉక్కిరిబిక్కిరయ్యే ఒక మధ్యతరగతి మానవుడికి, దేవుడే ప్రత్యక్షమై వరాలనిస్తే, అతను సద్వినియోగం చేసుకున్నాడా దుర్వినియోగం చేసుకున్నాడా? అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ వెళుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి పాత్రను దర్శకుడు డిజైన్ చేస్తూ వెళ్లిన విధానం ఆడియన్స్ కి అవసరమైన వినోదాన్ని పంచుతుంది.మానవుడి కోరిక .. దేవుడి వరం అనే రెండు ప్రధానమైన అంశాలను టచ్ చేస్తూ సాగే ఈ కథ, బోర్ అనిపించకుండా సరదాగా సాగిపోతూ ఉంటుంది. తాము బాగుపడాలనే కోరికతో పాటు, ఇతరులు చెడిపోవాలనే మానవుల సహజమైన అసూయ ద్వేషాలను కూడా దర్శకుడు ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. ముఖ్యంగా దేవుడిచ్చిన బుక్ కోసం కొంతమంది స్వార్థపరులు ప్రయత్నించడం .. ఆ బుక్ చేతులు మారుతూ వెళ్లడం సరదాగా నవ్విస్తుంది. అలాగే స్వామివారే స్వయంగా ఆభరణాలు ఒలిచి ఇచ్చారని చెబితే కుటుంబ సభ్యులు నమ్మకపోవడం కూడా సరదాగా అనిపిస్తుంది. ఫస్టాఫ్ లో స్వామివారి ఆభరణాలకు సంబంధించిన సన్నివేశాలు, సెకండాఫ్ లో స్వామివారు ఇచ్చిన 'బుక్' కి సంబంధించిన సన్నివేశాలు ఆడియన్స్ కి కనెక్ట్ అవుతాయి. నాగేశ్వరరెడ్డి కామెడీపై తనకి గల పట్టును మరోసారి నిరూపించాడు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతంఎడిటింగ్ ఫరవాలేదు. గ్రాఫిక్స్ కి సంబంధించిన




వర్క్ బాగుంది. శ్రీకాంత్ .. లయ .. రాజేంద్రప్రసాద్ నటన చాలా సహజంగా అనిపిస్తుంది. సునీల్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కామెడీ కూడా సందడి చేస్తుంది. దణ్ణం పెట్టుకోగానే దేవుడు ప్రత్యక్షమైతే .. కోరగానే కోరికలు తీర్చుకునే అవకాశం ఇస్తే బాగుంటుందని చాలామంది అనుకుంటారు. అలానే జరిగితే ఆ మనిషి ఎలాంటి ఇబ్బందులలో పడతాడో చూపించే కంటెంట్ ఇది. ఎవరికి ఏది ఇవ్వాలో .. ఎప్పుడు ఇవ్వాలో దైవానికి తెలుసు. ఆశపడిపోయి .. ఆరాటపడిపోయి పరుగులు పెడితే ఏం జరుగుతుందనేది వినోదభరితంగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఇతరులకు సాయం చేసేవారికే, దేవుడు సాయం చేస్తాడనే ఒక సందేశాన్ని ఇచ్చే ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి సరదాగా చూడొచ్చు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.